విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news


హైదరాబాద్
12-1-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 133

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## తెలంగాణను వణికిస్తున్న చలి..
## దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- తెలంగాణ వ్యాప్తంగా భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- 12 జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రానికి మరో మూడు రోజుల పాటు చలి హెచ్చరిక జారీ

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు చేరడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.




2లో

## రహదారులు రద్దీగానే..

- టోల్‌ప్లాజాల వద్ద బారులుతీరిన వాహనాలు
- వరంగల్ రూట్లో పండుగ, మేడారం జాతరకు...
- హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై డ్రోన్ కెమెరాతో నిఘా
- బైక్‌లపై భారీ సంఖ్యలో వెళుతున్న ప్రజలు

చౌటుప్పల్ సూర్యాపేటటౌన్: మూడోరోజూ రహదారులపై రద్దీ కొనసాగుతోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారం కూడా ప్రజలంతా పట్నం నుంచి పల్లెబాట పట్టారు.





## మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది: హరీశ్ రావు

- రేవంత్ నడుపుతోంది సర్కారా? సర్కస్ కంపెనీనా? అంటూ హరీశ్ రావు ఫైర్
- కోమటిరెడ్డికి తెలియకుండానే సినిమా టికెట్ రేట్లపై జీవోలు వస్తున్నాయని విమర్శ
- సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని మరిచారని ఆరోపణ
- టికెట్ల దందా వెనుక ఓ రాజ్యాంగేతర శక్తి ఉందని సంచలన వ్యాఖ్యలు
- ఈ వ్యవహారంపై గవర్నర్ విచారణ జరపాలని డిమాండ్

2లో

# భూ భారతిలో లోపం ఉందా?



### ప్రభుత్వ ఖజానాకు రాకుండా దారి మళ్లింది రూ.42 కోట్లు మాత్రమేనా?

### స్టాంపు డ్యూటీ సొమ్ము కాజేతలో భారీ కుంభకోణం జరిగిందన్న అనుమానాలు



**రాష్ట్రంలో కొత్త కుంభకోణం వెలుగు చూసింది. కొందరు మీసేవ కేంద్రాల నిర్వాహకులు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వ ఖజానాకు జమ కాకుండా స్వాహా చేసినట్లు వెల్లడైంది. కొనుగోలుదారులు చెల్లించిన స్టాంపు డ్యూటీ మొత్తంలో 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చేరేలా చేసి.. 90 శాతం సొమ్మును తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు తేలింది. తొలుత ఇది యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అనుకున్నప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అక్రమం చోటుచేసుకున్నట్లు నిర్ధారణ అయింది.**

**(ప్రభాత సూర్య), తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ములో రూ.42 కోట్లను అక్రమార్కులు కాజేశారని తమ విచారణలో వెల్లడైనట్లు అధికారులు ప్రకటించారు. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కుంభకోణంలో ఇంత తక్కువ మొత్తం ఉండబోదని, సర్కారుకు భారీగానే నష్టం వాటిల్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు అసలు విషయాన్ని దాచిపెట్టి.. కొసరు మాత్రమే వెల్లడిస్తున్నారని అంటున్నారు. స్టాంపు డ్యూటీ కుంభకోణం జరగడానికి కారణం భూ భారతి పోర్టల్ లో లోపాలేనన్న విమర్శలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణిని పక్కన పెడుతూ..

మిగతా 2లో

## మేడారం' ప్రత్యేక బస్సుల్లో చార్జీలు 50 శాతం అదనం

### ఈసారి జాతరకు 3,495 ప్రత్యేక బస్సులు



హైదరాబాద్: మేడారం జాతరకు ఈసారి ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో చార్జీలు 50 శాతం అదనంగా వసూలు చేయాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక

2లో

## రాష్ట్రాన్ని అప్పులపాలు చేయబోం: భట్టి

- అన్ని రంగాల్లో అగ్రగామిగా ముందుకు తీసుకెళ్తాం
- సింగరేణి సమస్యలపై త్వరలో సమావేశం: డిప్యూటీ సీఎం



## తెలంగాణలో కాంగ్రెస్ కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదు...

### అసలు ఫైట్ మాతోనే: కేటీఆర్

- తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తి కాదన్న కేటీఆర్
- అసలు రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యేనని ఉద్ఘాటన
- కాంగ్రెస్ 24 నెలల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కేవలం గాలివాటమేనని వ్యాఖ్య
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా

తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.



## దాడి చేస్తే అంతు చూస్తాం

- అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు
- ఇజ్రాయెల్‌నూ లక్ష్యం చేసుకుంటాం
- పార్లమెంటు స్పీకర్ ప్రకటన.. తీవ్రతరమవుతున్న ఉద్రిక్తతలు
- ఇరాన్‌లో నిరసనలు తీవ్రరూపు ..వందలాది మంది మృతి

టెహ్రాన్/దుబాయ్: నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో పరిస్థితి క్రమంగా చేయి దాటిపోతోంది. ప్రజల ఆక్రోశం తీవ్ర ఆవేశంగా రూపుదాలుస్తోంది. దేశవ్యాప్తంగా ఏ నగరం చూసినా ఉద్యమాలతో అట్టుడికిపోతోంది. మొత్తం 36 ప్రావిన్సుల్లోనూ జనాందోళన పెద్దపెట్టున కొనసాగుతోంది. 100కు పైగా నగరాలు అట్టుడుకుతున్నాయి. ముఖ్యంగా రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం నిరసనకారులు

2లో



# మేడారం' ప్రత్యేక బస్సుల్లో చార్జీలు 50 శాతం అదనం

సంఖ్యలో పాల్గొనబోతున్నందున, గతంతో పోలిస్తే బస్సుల సంఖ్య పెంచాలని భావించినా వాటి లభ్య త సమస్యగా మారింది. దీంతో అందుబాటులో ఉన్న బస్సులను తిప్పాలని నిర్ణయించింది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు చార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి అనుమతి ఉంది. దాన్ని వినియోగించుకోవటం ద్వారా సాధారణ చార్జీలను అంతమేర పెంచాలని నిర్ణయించింది. జనవరి 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. గత జాతర సమయంలో 3,491 ప్రత్యేక బస్సులను నడిపితే అవి కీలక సమయాల్లో సరిపోలేదు. కొంత నిర్వహణ లోపాల వల్ల ఆర్టీసీ బస్సులను భక్తులు వాడుకోలేకపోయారు. వెరసి ఇబ్బందులు ఎదురయ్యాయని సంస్థ గుర్తించింది. దీంతో ఈసారి అంతకంటే ఎక్కువ బస్సులు నడపాలని నిర్ణయించింది. కానీ, బస్సుల సర్దుబాటు కష్టంగా మారటంతో ప్రస్తుతానికి 3,495 బస్సులను సిద్ధం చేసుకుంది. అవసరమైతే మరికొన్నింటిని సిద్ధం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ బస్సులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి నడుస్తాయి. వీటిల్లో సాధారణ చార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ (ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్) వసతి ఉన్నందున మహిళా ప్రయాణికులకు ఈ నిర్ణయం భారం కాబోదు. కానీ, పురుష ప్రయాణికుల జేబులపై మాత్రం భారం పడనుంది. గత జాతర సమయంలో అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బడి ముబ్బడిగా వీఐపీ పాస్‌లు జారీ చేశారు. ఒకే సమయంలో ఎక్కువ మంది వీఐపీలు రావటం, వారి వాహన శ్రేణి జాతర వరకు అనుమతించడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ చోటుచేసుకుంది. ఆయా సమయాల్లో పోలీసులు ఆర్టీసీ బస్సులను లోనికి అనుమతించలేదు. దీంతో బస్సులు శివారు ప్రాంతాల్లోనే నిలిచిపోయి సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈసారి ఆ పరిస్థితి రాకుండా, పాసుల జారీని నియంత్రించాలని ఆర్టీసీ అధికారులు ములుగు జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులను కోరారు. వచ్చే వీఐపీలు కూడా ఒకే సమయంలో రాకుండా నియంత్రించాలని కూడా కోరారు. ఆర్టీసీ బస్సులను నిలిపివేసి భక్తులకు ఇబ్బంది రాకుండా ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

# రాష్ట్రాన్ని అప్పులపాలు చేయబోం: భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ములుగు: గత పాలకుల మాదిరిగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయనీయబోమని, అన్నిరంగాల్లో అగ్రగామిగా ముందుకు తీసుకెళ్లి 2047నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో 4.5 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గానికి 3,500 మంది లబి?ధదారులను ఎంపిక చేశామన్నారు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం లభించిందని స్పష్టం చేశారు. త్వరలోనే మళ్లీ వస్తామని, పవర్ ప్రాజెక్టు శంకుస్థాపన చేస్తానని చెప్పారు.సింగరేణి సంస్థ అభివృద్ధి, పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని భట్టివిక్రమార్క అన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజావసరాల కోసం నిత్యం తపిస్తున్న నాయకుడు రాజ్‌ఠాకూర్ అని ప్రశంసించారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన యాత్రలో నా వెంట నడిచిన రాజ్‌ఠాకూర్‌కు ఆనాడే ఇచ్చిన మాట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ, ప్రిన్సిపల్ ఎనర్జీసెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# తెలంగాణను వణికిస్తున్న చలి.. దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

రానున్న మూడు రోజుల పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో అత్యల్పంగా 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.9 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న గాలుల ప్రభావంతోనే రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని కారణంగా రాబోయే రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# రహదారులు రద్దీగానే..

(మొదటి పేజీ తరువాయి)

దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారితోపాటు హైదరాబాద్-- వరంగల్ రహదారిపై వాహనాలు బారులుదీరాయి. గంట సమయంలో చేయాల్సిన ప్రయాణం రద్దీ కారణంగా రెండు గంటలకు పైగా సమయం పట్టింది. చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. ఇదే మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటరు దూరం వరకు బారులుదీరాయి. టోల్‌ప్లాజా వద్ద 16 టోల్ బూత్‌లు ఉండగా సాధారణ రోజుల్లో ఇరువైపులా సమానంగా 8 బూత్‌ల చొప్పున కేటాయిస్తారు. ప్రస్తుత రద్దీ నేపథ్యంలో విజయవాడ మా ర్గంలో 12 బూత్‌లు, హైదరాబాద్ మార్గంలో 4 బూత్‌లను కేటాయించారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 46 వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు మరో 15వేల వరకు వాహనాలు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ? నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా హైదరాబాద్-- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు కిక్కిరిశాయి. సాధారణ రోజుల్లో రోజూ 18 వేల నుంచి 20 వేల వాహనాలు ఈ టోల్‌ప్లాజా నుంచి రాకపోకలు సాగిస్తుండగా ఆదివారం ఒక్కరోజే దాదాపు 40 వేల వాహనాలు వెళ్లినట్టు అధికారులు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూ రు టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

# తెలంగాణలో కాంగ్రెస్ కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదు...

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నేత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కూడా పాల్గొన్నారు.

# దాడి చేస్తే అంతు చూస్తాం

వీధుల్లోకి పోటెత్తారు. ఖమేనీ నియంతృత్వ పాలన తమకొద్దంటూ నిరసనలతో హోరెత్తించారు. వాటిని ఇరాన్ ఉక్కుపాదంతో అణచివేస్తుండటం, దీన్ని చూస్తూ ఊరుకోబోమని, నేరుగా జోక్యం చేసుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్‌ను హెచ్చరించడం తెలిసిందే. దాంతో ఆ రెండు దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రరూపు దాలుస్తున్నాయి. పరిస్థితి ఏ క్షణమైనా అదుపు తప్పేలా కనిపిస్తోంది. అయితే ఇంటర్నెట్ పడకేయడం, ఫోన్ లైన్లు కూడా మూగబోవడంతో అక్కడ తాజా పరిస్థితి అంచనాలకు అందడం లేదు. వాస్తవ మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక వేలాది మందిని సైన్యం, పోలీసు బలగాలు నిర్బంధంలోకి తీసుకుంటున్నట్టు వార్తలందుతున్నాయి. నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ ఆందళన వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ తాజాగా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడికి దిగే దుస్సాహసం చేస్తే అగ్ర రాజ్యం, దానితో పాటు ఇజ్రాయెల్ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఖలిబాఫ్ ఆదివారం పేర్కొన్నారు. నిండు పార్లమెంటులోనే ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ఇరాన్‌లో జనాగ్రహం, నిరసనల వెల్లువ కొనసాగుతూనే ఉన్నాయి. టెహ్రాన్‌తో పాటు రెండో అతి పెద్ద నగరం మషాద్‌లోనూ ప్రజలు వీధుల్లోకి పోటెత్తుతున్నారు. రాత్రుళ్లు సెల్‌ఫోన్ లైట్లు వెలిగించి మరీ నిరసన తెలుపుతున్నారు. నినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఇందుకు సంబంధించిన శాటిలైట్ ఫుటేజీ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. వీధుల నిండా పోలీసు, సైనిక సిబ్బంది పహారా, డ్రోన్ల నిఘా పెరిగినట్టు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి.

మషాద్‌లో పలుచోట్ల పోలీసులు, భద్రతా దళాలతో జనం ఘర్షణలకు దిగుతున్నారు. వీధుల నిండా తగలబడ్డ సామాన్లు తదితరాలు కనిపిస్తున్నాయి. కెర్మన్ తదితర నగరాలు నిరసనలతో అట్టుడుకు తున్నాయి. వాటిని మరింత తీవ్రతరం చేయాల్సిం దిగా ప్రజలకు పిలుపునిస్తూ ప్రవాసంలో ఉన్న ఇరాన్ రాకుమారుడు రెజా పహ్లవీ ఒక వీడియో విడుదల చేశారు. ప్రభుత్వ టీవీలో మాత్రం ఖోమ్, ఖాజ్విన్ తదితర నగరాల్లో జరుగుతున్న ప్రభుత్వ అనుకూల నిరసనల దృశ్యాలను చూపిస్తున్నారు. ఇరాన్ పార్లమెంటు కార్యకలాపాల ను ప్రభుత్వ టీవీ చానల్ ఆదివారం ప్రత్యక్ష ప్రసారం చేసింది. నిరసనలను అదుపు చేయడంలో అవిశ్రాం తంగా శ్రమిస్తున్నారంటూ పోలీసులు, రివల్యూషనరీ గార్డ్ సిబ్బందిని స్పీకర్ ఖలిబాఫ్ ప్రస్తుతించారు. నిరసనల్లో అరెస్టయిన వారి విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అమెరికా గనక ఇరాన్‌పై దాడికి దిగితే ఈ ప్రాంతంలోని ఆ దేశ సైనిక స్థావరాలు, యుద్ధ నౌకలు తదితరాలన్నింటినీ లక్ష్యంగా చేసుకుం టామని ఆయన స్పష్టం చేశారు. రెండు వారాలకు పైగా ఇరాన్‌లో సాగుతున్న ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 538కు పెరిగినట్టు అమెరికాకు చెందిన మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ 'యాక్టివిటీ'పేర్కొంది.

# పాఠశాల విద్యార్థులకు వైద్యులు సీపీఆర్ నేర్పిస్తే, వారు ఎన్నో ప్రాణాలు కాపాడుతారు: రేవంత్ రెడ్డి

## ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి

పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌నని అన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాలసీలను మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఇందుకోసం వైద్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది: హరీశ్ రావు

తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి 'నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. "శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. "రేవంత్ రెడ్డి గారు, మీరు నడుపుతోంది సర్కారా లేక సర్కస్ కంపెనీనా?" అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను, ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. "పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?" అని ప్రశ్నించారు. "గత పదేళ్లు కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు.

# భూ భారతిలో లోపం ఉందా?

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ సర్కారు లోపభూయిష్టమైన భూ భారతిని తీసుకొచ్చిందనే ఆరోపణలూ వెల్లువెత్తున్నాయి. అయితే.. ఈ కుంభకోణం భూ భారతి వచ్చాక ప్రారంభమైంది కాదని, ధరణి అమల్లో ఉన్నప్పటి నుంచి కొనసాగుతోందని సీసీఎల్ఏ ఆడిట్ లో తేలినట్లు అధికారులు చెబుతున్నాయి. ఆరేళ్ల క్రితం 2020లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ బాధ్యతలను ధరణి ద్వారా తహసీల్దార్లకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అప్పగించింది. అయితే మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంపు డ్యూటీ చెల్లించాక.. అవి ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యాయా, ఎంత జమ అయ్యాయి అని తహసీల్లార్లు క్రాస్ చెక్ చేసే వ్యవస్థను పోర్టల్ లో ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ అంశాన్ని చెక్ చేయకుండానే తహసీల్దార్లు రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమార్కులు స్టాంపు డ్యూటీ చెల్లింపు సమయంలోనే మాల్ వేర్ ను ఉపయోగించి దోపిడీకి పాల్పడ్డారు. భూ భారతి పోర్టల్ కు నకిలీ చెల్లింపు యాప్ ను జోడించి.. కొనుగోలుదారులు చెల్లించిన మొత్తం సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లుగా రసీదు ఇచ్చారు. కానీ, ఆ తరువాత అందులో 10 శాతానే ప్రభుత్వ ఖాతాకు పంపించి మిగిలిన మొత్తాన్ని తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. గత ఆరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 52 లక్షల లావాదేవీలు జరగగా.. ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ రూపంలో రూ.13 వేల కోట్లు వచ్చాయని సీసీఎల్ఏ ఆడిట్లో తేల్చారు. అయితే ఇందులో 4300 లావాదేవీలకు సంబంధించిన స్టాంపు డ్యూటీ మాత్రం మొత్తం జమ కాలేదని గుర్తించారు. వీటి ద్వారా రూ.42 కోట్లు దారి మళ్లినట్లు నిర్ధారించారు. ఇందుకు భూ భారతిలోని లోపాలనే అక్రమార్కులు వాడుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీనిపై లోతైన విచారణ జరపనున్నట్లు, ఈ 4300 లావాదేవీలను మరోసారి ఆడిట్ చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వానికి రాకుండాపోయిన రూ.42 కోట్లను రికవరీ చేయనున్నట్లు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అధికారులు చెబుతున్న లెక్కలపై మాత్రం అందరిలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరేళ్లుగా కుంభకోణం జరిగితే.. అది కూడా 52 లక్షల లావాదేవీలు జరిగి.. ప్రభుత్వానికి రూ.13 వేల కోట్ల ఆదాయం సమకూరినప్పుడు.. అక్రమానికి అవకాశం ఉన్నచోట రూ.42 కోట్లే పక్కదారి పట్టాయా? అన్నది అనుమానంగా మారింది. పైగా, మీసేవ కేంద్రాల నిర్వహకులు మాత్రమే ఈ కుంభకోణానికి పాల్పడ్డారా?వారికి రెవెన్యూ శాఖ నుంచి సహకారం అందిందా? అన్నదీ అనుమానంగా మారింది. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయి

## ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే.. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్





**భువనగిరి, జనవరి 11(ప్రభాత సూర్య):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ అన్నారు. ప్రజల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది మార్క్సిస్టులేనని వారు తెలియజేశారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశం (పిక్నిక్) శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతూ ఉంటే మన దేశంలో మాత్రం మూఢాచారాలకు కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని విమర్శించారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. సోషలిస్టు దేశాల్లో ఎర్ర జెండా పాలనలో ఆకలి, దారిద్ర్యం, దోపిడి, అణిచివేత లేకుండా ప్రజలందరికీ విద్యా, ఉద్యోగం ఉపాధి అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బిజెపి పాలనలో మాత్రం కులాల, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. విద్యా, వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం చేయాలన్నా, గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్న రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి తగిన నిధులు కేటాయించాలని జహంగీర్ సూచించినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి మల్లేష్, కొండమడుగు నాగమణి, సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచులు బొల్లెపల్లి కుమార్, గునుగుంట్ల కల్పన, ఏదునూరి ప్రేమలత, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, సిపిఎం మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్, బొల్లపల్లి లీల, గ్రామ నాయకులు ఎండి జహంగీర్, కడారి కృష్ణ, స్వామి, మల్లేష్, కిషన్, పాండు, బాల మల్లేష్, బాలరాజు, కళ్యాణి, జ్యోతి, హేమలత, కావ్య, ప్రీతి, నజీమా తదితరులు పాల్గొన్నారు.



## సింగపంగా నరేష్ దశదిన కార్యక్రమానికి నిత్యవసర సరుకులు అందజేసిన టిఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ నరసింహ గౌడ్

**సంస్థాన్ నారాయణపురం, జనవరి 11( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన సింగపంగా నరేష్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం దశదిన కార్యక్రమానికి వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం ఐదు లీటర్ల నూనె అందజేసిన టిఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ నరసింహ గౌడ్. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎదుటి తిరుమలేశా, మాజీ ఎంపీటీసీ గడ్డం పెంటయ్య, టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు బైకని సైదులు, సీనియర్ నాయకులు తండా శ్రీనివాస్ గౌడ్,తండా యాదయ్య గౌడ్ ,కొండూరి నర్సింహా గౌడ్, గడ్డం అంజయ్య, టిఆర్ఎస్వి యూత్ వింగ్ నాతి రాజు గౌడ్, యూత్ ప్రెసిడెంట్ తండా మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విద్యార్థులకు అవగాహన



**కాకినాడ, జనవరి 11(ప్రభాత సూర్య):** కాకినాడ జిల్లాలోని, 2 టౌన్ పోలీసు స్టేషన్ లో లా విద్యార్థుల కోసం ప్రత్యేక సందర్శన శిక్షణ సదస్సు నిర్వహించారు. కాకినాడ జిల్లాలోని, తూరంగి వద్ద ఉన్నటువంటి పి.ఎస్ రాజు లా కళాశాల ప్రిన్సిపాల్ బి.డాక్టర్ సంగీత ఆధ్వర్యంలో బి.ఎ, ఎల్.ఎల్.బి, 5 ఇయర్స్, ఫైనల్ ఇయర్ విద్యార్థులు, 2 టౌన్ పోలీసు స్టేషన్ సందర్శించి, సీఐ అప్పల నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ, లా సిలబస్ లో బాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2 టౌన్ ఎస్సై బుచ్చి బాబు,, హెడ్ కానిస్టేబుల్ శేష రావు, విద్యార్థులకు, న్యాయ శాస్త్రానికి సంబంధించిన పలు, కీలక అంశాల మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సంగీత మాట్లాడుతూ ఈ సందర్శనకు సహకరించిన పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్శన కార్యక్రమంలో మహాలక్ష్మి, స్వప్న, యజ్ఞ చంద్రిక, వెంకట్ రావు, లవ రాజు, సుధీర్, సుధీర్ నాయుడు, బాలు, సాయి, వంశి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజా ప్రభుత్వం ముందుంది

### టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** ప్రజల కనీసం అవసరాలైన మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్ సఫ్దర్ నగర్ నగర్ లో స్థానిక నాయకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారమై పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని నిధులకు లోటులేదని ఎన్ని నిధులైనా కేటాయించేందుకు సిద్ధమని ఈ సందర్భంగా రమేష్ ప్రకటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన లైఫ్ కేర్ న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, జమీర్, విట్టల్ రెడ్డి, మోయనుద్దీన్, హుస్సేన్, బార్కాత్ అలి, లక్ష్మయ్య, అబ్దుల్లా, నజీర్, మైనారిటీ యూత్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 1982-83 ఉపాధ్యాయ శిక్షణార్థుల ఆత్మీయ సమ్మేళనం- చంద్రశేఖర్, డివిఎం రాజు




**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణ కేంద్రం మిర్యాలగూడ రోడ్ డైట్ కళాశాల లో ఆదివారం 1982- 83 సంవత్సర ఉపాధ్యాయ శిక్షణార్థుల బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించి, ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుర్తుకొస్తున్నాయి 40 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన కళాశాలను నాడు గురువులు నేర్పిన నైతిక విలువలు, క్రమశిక్షణ చదువుతో ఈరోజు వివిధ స్థాయిలో ఉన్నామని మమ్ములను మహాశక్తిగా మల్చారని తెలిపారు ఒకసారి కాలం వెనక్కి వెళ్తే మీతో మళ్ళీ దెబ్బలు తింటాం ఈరోజు స్నేహితులతో గడిపిన సమయం మా హృదయంలో శాశ్వతంగా, ఆనందంతో నింపుకుంటామని ఇదే నిజమైన స్నేహం అని పేగు బంధం కాదు, రక్తం బంధం అసలే కాదు ఇదేరా స్నేహం అంటే ఆనందభాష్పాలతో ఆత్మీయ కలయిక జరిగింది. మట్టికి, గాలికి, నీటికి, పుట్టకి వందనం అభివందనం తెలిపారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కే. చంద్రశేఖర్, డివిఎం రాజు, సిహెచ్ ఝాన్సీ, రాజిరెడ్డి, రాజేశ్వర్, రమణారెడ్డి, సోమేశ్వర రావు, కృష్ణయ్య, రవీంద్రరావు, వెంకన్న, రవీందర్ రావు, ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ,క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం( సూర్య ప్రతినిధి ):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా నూతన సంవత్సర డైరీ ని అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు మోదుగు వేలాద్రి అధ్యక్షతన తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత సహకార శాఖ మాత్యులు చే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీజీవో రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈజెఏసి సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అధికారులకు ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలియజేశారు. ఖమ్మం జిల్లాని రాష్ట్రంలో ముందు వరుసలు ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఏలూరి శ్రీనివాసరావు ఉద్యోగులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది మంత్రి సానుకూలంగా స్పందించారు.గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు స్థానిక మున్సిపల్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్ గంగవరపు నరేందర్ ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ మహిళా అధ్యక్ష కార్యదర్శులు ఉషాశ్రీ సుధారాణి టీజీవో మహబూబాబాద్ ఉపాధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు జి రమేష్ రాజశేఖర్ గౌడ్ కనపర్తి వెంకటేశ్వర్లు హరీష్ ఎం సతీష్ పుష్పరాజ్ టి మంజుల డి బాలాజీ ఎంఏ గౌస్ పాషా డి అరుణకుమారి తాజుద్దీన్ ఏం గోపాలకృష్ణ కేజీపివీ పాటిల్ తమ్మిశెట్టి శ్రీనివాసు మోదు వెంకటేశ్వర్లు బానోతు హాథిరాం ఆన్నోటి తిరుపతిరావు పంచాయతీరాజ్ ఈఈ మహేష్ టి వెంకటేశ్వర్లు జి జే ఎల్ ఏ అధ్యక్ష కార్యదర్శులు దార ప్రమీల బి నాగేశ్వరరావు డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం డాక్టర్ కే కిరణ్ కుమార్ డాక్టర్ బురుగు శ్రీనివాస్ డాక్టర్ కుక్కల కార్తీక్ పల్లా శ్రీనివాస వేణు ఆర్టికల్చర్ ఆఫీసర్ ఎఫ్ ఆర్ ఓ రాధిక బాలిని రామయ్య క్రిష్ణ కిరీటి తదితరులు హాజరైనారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొమిరిశెట్టి ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ , 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఆదివారం ఆదర్శ్ నగర్ కాలనీ రోడ్డు నెంబరు 2లో , బాలాజీ నగర్ శారదా హైస్కూల్ దగ్గర మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు" అని అన్నారు. ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల



సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం కూడా మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాము అని అన్నారు. ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపుపిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటిలోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీరక భంగిమలలో పనిచేయవలసి ఉంటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశవ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారు" అని అన్నారు. ఈ పోటీలలో 25 ం 25 మంది మహిళలు పాల్గొన్నారు. విజయలక్ష్మి కస్తూరి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాళ్ళు రాణి, వరలక్ష్మి , ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించిన ధీరుడు వడ్డే ఓబన్న

### మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** స్వాతంత్ర పోరాట సమయంలో తెల్లదొరలను గడగడలాడించి వారి గుండెల్లో వణుకు పుట్టించిన ధీరుడు వడ్డెరల ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్ జనతా నగర్ లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, సంఘం ప్రతినిధులు నర్సింహా, బందప్ప, మైసయ్య, సత్తయ్య, సాయిలు, రాజు, నాగేష్, ఇనుగంటి రాజు, గోపాల్, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

### చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు గంధం రాజు




**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా రమ్య గ్రౌండ్ శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం రాజు సౌజన్యంతో ఆదివారం రమ్య గ్రౌండ్ లో చిన్నారులకు ఉచితంగా గాలిపటాలను పంపిణీ చేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందించిన గంధం రాజు కి శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంధం రాజు మాట్లాడుతూ పిల్లలు ఎంతో సంతోషంగా సుమారు 300 మంది దాకా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, మన సంస్కృతి సాంప్రదాయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్న శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడానికి నా వంతుగా ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు కట్టా నరసింగరావు, ప్రధాన కార్యదర్శి కాముని నర్సింహారెడ్డి, జాయింట్ సెక్రెటరీ వాసిరెడ్డి లక్ష్మి నారాయణ, షేక్ సత్తార్, కొల్లా శంకర్, పెండేల వెంకట కోటేశ్వరరావు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, మోటేపల్లి శివకుమార్, నారాయణరావు, గోనెల దొరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగ్రో సీడ్స్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ - ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు సైదులు

**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణంలో మేకల అభినవ్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి నల్గొండ జిల్లా ఆగ్రో సీడ్స్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు మొత్తం 12 టీంలు ఆడగా అందులో మిర్యాలగూడ టీం ప్రథమ బహుమతి గెలుచుకుంది., హాలియా టీం ద్వితీయ బహుమతిగా గెలిచింది. ఈ యొక్క క్రికెట్ టోర్నమెంట్కు సహకరించిన దాతలు ప్రథమ బహుమతి 25000 రూపాలు ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ స్పాన్సర్ గా నిలిచింది, ద్వితీయ బహుమతికి15000 రూపాలు సుపురియల్ సీడ్స్ లిమిటెడ్ స్పాన్సర్ గా నిలిచింది. షీల్డ్స్ స్పాన్సర్ గా నిలిచిన దక్కన్ ఆగ్రో కెమికల్, మరియు కనకదుర్గ ఫర్టిలైజర్స్ సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్గనైజర్స్ మరియు క్రికెట్ టీం సభ్యులు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సైదులు, ఉపాధ్యక్షులు సాంబశివరావు, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి సురేష్, జాయింట్ సెక్రెటరీ సతీష్, ఎంప్లాయిస్ సభ్యులు సంజీవ, సైదులు, వేణు, వెంకన్న, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# పశువు లేని పల్లె.. నిస్సారమవుతున్న నేల

### రైతుకు నిజమైన బలం పశువులే,పొలానికి శక్తినిచ్చే పెంట కుప్పలు నేడు గ్రామాల్లో కనిపించకుండా పోతున్నాయి.

### ఇది కేవలం ఒక మార్పు కాదౌ పల్లెటూరి ఆర్థిక వ్యవస్థకు ప్రమాద సంకేతం.

**హైదరాబాద్, జనవరి 11( ప్రభాత సూర్య):** ఒకప్పుడు పల్లెల్లో తెల్లవారుజామున పశువుల గంటల శబ్దమే రోజుకు ఆరంభం. రైతు ఇంటి ముందున్న పశువుల పాక కేవలం పాలు ఇచ్చే స్థలం కాదు ,అది ఆ కుటుంబానికి రోజువారీ ఆదాయం, పొలానికి ప్రాణం, పల్లెకు ఆర్థిక ఆధారం. కానీ నేడు పరిస్థితి మారింది. ట్రాక్టర్ల శబ్దంలో ఆవుల అంకెలు, ఎద్దుల రంకెలు మెల్లగా మూగబోతున్నాయి. ఫలితంగా శతాబ్దాలుగా భూమికి బలాన్నిచ్చిన పశువుల ఎరువు కనుమరుగవుతోంది. ఇది ఒక అలవాటు మార్పు కాదౌ వ్యవసాయ పునాదులే కదిలిపోతున్నాయి.





**నేలతల్లికి పశువే ప్రాణం**

సారవంతమైన నేలలో కనీసం 1% సేంద్రియ కర్బనం ఉండాలి.కానీ నేడు రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల ఇది 0.5% కంటే తక్కువకు పడిపోయింది, నేలలు సారం కోల్పోతున్నాయి.. పశువుల ఎరువు అంటే కేవలం పోషకాలు కాదు నేల మృదుత్వాన్ని కాపాడుతుంది, నీటిని పట్టి ఉంచే శక్తిని పెంచుతుంది,మేలు చేసే సూక్ష్మజీవులను పెంచుతుంది,పశువుల ఎరువు వాడితే,నేల నీటిని నిల్వ ఉంచే శక్తి సుమారు 30% వరకు పెరుగుతుంది,తక్కువ వర్షం వచ్చినా పంట నిలబడగలుగుతుంది, కోట్లాది మేలు చేసే సూక్ష్మజీవులు నేలలో చురుకుగా పనిచేస్తాయి..పెంట లేకపోతే రైతు రసాయన ఎరువులపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో నేల కఠినమవుతుంది సాగు ఖర్చు పెరుగుతుంది..

**మాయమవుతున్న మేత భూములు**

ఒకప్పుడు ప్రతి గ్రామంలో పశువుల మేత భూములు భూములు ఉండేవి. నేడు అవి ఆక్రమణలకు, రియల్ ఎస్టేట్‌కు బలవుతున్నాయి. దేశంలో పశుగ్రాసం కొరత సుమారు 40% వరకు ఉంది అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. మేత సాగు చేసే రైతులకు సరైన ప్రోత్సాహకాలు లేవు ట్రాక్టర్లు వచ్చాయని ఎద్దులు అవసరం లేదనుకోవడం పెద్ద తప్పిదంగా మారింది..

**పాల ధరలు రైతును ముంచుతున్న మార్కెట్**

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి దేశం. కానీ పాలు పితికే రైతు మాత్రం కష్టాల్లోనే ఉన్నాడు. గత ఐదేళ్లలో దాణా, మందుల ధరలు 60% పైగా పెరిగాయి,పాల ధర పెరిగింది కేవలం 10% మాత్రమే,పంటలకున్నట్లుగా పాలకు కనీస మద్దతు ధర లేదు ప్రైవేట్ డైరీలు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తూ రైతును నష్టపరుస్తున్నాయి..

**మహిళల ఆర్థిక స్వేచ్ఛకు దెబ్బ**

పశుపోషణ అంటే గ్రామీణ మహిళల చేతిలో ఉండే రోజువారీ ఆదాయ వనరు. పాల అమ్మకం ద్వారా వచ్చే డబ్బుతోనే కుటుంబ ఖర్చులు నడుస్తాయి.పశువులు తగ్గితే మహిళల ఆర్థిక స్వేచ్ఛ దెబ్బతింటుంది రైతు కుటుంబం చిన్న అవసరాలకూ కూడా అప్పులపై ఆధారపడాల్సి వస్తుంది

**ఇప్పుడు చేయాల్సింది ఏమిటి?**


ప్రభుత్వం పశుపోషణను “అనుబంధ రంగం”గా కాకుండా వ్యవసాయానికి ప్రాణధారంగా గుర్తించాలి. లిదానికి తీసుకోవాల్సిన ప్రధాన చర్యలు పశువుల ఎరువు వాడే రైతులకు సేంద్రియ బోనస్ ఇవ్వాలి,పాలకు శాస్త్రీయంగా లెక్కించిన మద్దతు ధర ప్రకటించాలి. గ్రామాల్లో మేత భూములను రక్షించి పశుగ్రాసం పెంచాలి. సహకార డైరీలను బలోపేతం చేసి మధ్యవర్తుల దోపిడీ అరికట్టాలి పెంట తగ్గితే , రసాయనాల వాడకం పెరుగుతుంది. రసాయనాలు పెరిగితే సాగు ఖర్చు పెరుగుతుంది. ఖర్చు పెరిగితే అప్పులు పెరుగుతాయి. ఇది ఒక విషవలయంగా మారి పుడమిని,పర్యావరణాన్ని కలుషితం చేస్తుంది , రైతుకు ఆర్థిక భారంగా మారుతుంది..

**పశువును భారం అనుకుంటే**

రేపటి వ్యవసాయమే భారం అవుతుంది. పల్లెలో పశువు ఉంటేనే నేలకు బలం, రైతుకు ప్రాణం,దేశానికి క్షేమం...

## ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

### తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** యాంత్రిక జీవితానికి అలవాటు పడిన ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్ క్లేవ్ లో ఆర్.ఎన్.సి హాస్పిటల్ డాక్టర్ రమేష్ సౌజన్యంతో తేళ్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డేపల్లి ఎన్ క్లేవ్ కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్, పీఎస్ఆర్కే భగవాన్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేళ్ల హరికృష్ణ, రాహుల్ ప్రదీప్ మాట్లాడుతూ రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు తమ వంతు కృషిగా తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి గత ఆరు నెలలుగా హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ డివిజన్ లో పలుచోట్ల బ్లడ్ డొనేషన్ క్యాంప్, హై టెస్టింగ్ క్యాంప్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది ఐదవ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య శిబిరమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జీఆర్‌బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్, ఉచిత మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న హాస్పిటల్స్ సిబ్బందికి డాక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రైతులతో కరెంటు వైర్ల మరమత్తు పనులు

### రైతుకు జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు.


### ఏఈ అక్కడే ఉండి రైతుతో పనులు చేపిస్తున్న వైనం

### ప్రజా బాటలో భాగంగా పనులు చేపిస్తున్నానంటున్న ఏఈ.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి11:** మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హనుమంతపూర్ గ్రామంలో ఓ రైతు పొలంలో గత మూడు రోజుల క్రితం మూడు వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా ఆ ప్రాంతంలో పనిచేసే లైన్మెన్ ఎవరు లేరని సమాధానం ఇచ్చాడని రైతు వాపోయాడు. అందుకే తాను స్వతగా తెగిపడిన ఆ వైర్లను మరమ్మత్తులు చేస్తున్నానని రైతు తెలిపారు. ఇకపోతే ఈ విషయంలో కొసమెరుపు ఏమిటంటే రైతు విద్యుత్ మరమ్మత్తులు చేస్తుండగా నర్సాపూర్ మండల ఏ.ఈ అక్కడే ఉండి రైతుతో మరమ్మత్తు పనులు చేస్తున్నాడు. ఈ విషయమై విలేకరులు ఏఈని వివరణ కోరగా ఇక్కడ పనిచేసే లైన్మెన్ లేక మరమ్మత్తు చేయడం లేట్ అయిందని సమాధానం ఇచ్చాడు. అయినా కూడా ఏఈ తన పరిధిలో ఉన్న లైన్మెన్లను ఎవరినైనా పిలిచి ఈ ప్రాంతంలో పనిచేయించొచ్చు కానీ ఒక మండల స్థాయి అధికారి అయి ఉండి పొంతలనేని సమాధానం ఇస్తున్నాడని రైతు తెలిపారు. ప్రజాబట కార్యక్రమంలో ఈ పనులు చేయిస్తున్నానని ఏఈ తెలపడం సోంచనీయమని ప్రజలు అంటున్నారు. ప్రజాభాట కార్యక్రమం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నిర్వహిస్తారు తప్ప నరసాపూర్ ఏఈ గారికి ఒక్కరికి మాత్రమే ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. తను కూర్చుని రైతుతో మరమ్మత్తుల పనులు చేయించడం సబాబుగా లేదని రైతులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుతో పని చేయించిన ఏఈని వెంటనే సస్పెండ్ చేయాలని, లేదంటే అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.








# జర్నలిస్టుల సంక్షేమానికి నా సంపూర్ణ సహకారం అందిస్తాం

## ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు.. ఎమ్మెల్యే ఎమ్మెల్సీలను మర్యాదపూర్వకంగా కలిసిన ఙఖఔజీ (ఎ-143)

### కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గం శాలువాతో నూతన కమిటీ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**కుత్బుల్లాపూర్, జనవరి 11 (ప్రభాత సూర్య) :** జర్నలిస్టుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో, వారి సంక్షేమం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ శ్రీ కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు లను వేర్వేరుగా ఆదివారం వారి నివాస కార్యాలయం వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఙఖఔజీ ఎ-143) కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ లు అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని, ప్రజా సమస్యలను వెలికితీయడంలో వారు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల అభివృద్ధికి, వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో పాల్గొన్న వారిలో యూనియన్రాష్ట్ర నాయకులు శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలేపాక వెంకట్, మాజీ అధ్యక్షులు సుధీర్ మంకాల, కుత్బుల్లాపూర్ యూనియన్ నూతన గౌరవ అధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నాలేటి మాధవరెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, ఉపాధ్యక్షులు బాన్సువాడ వెంకటేష్, సహాయ కార్యదర్శులు జుట్టు సాయి, సూర్య చందర్, కార్యనిర్వాహక కార్యదర్శులు పెంటయ్య, సందీప్, కార్యవర్గ సభ్యులు శ్రీరామ రాజు, పి. శివ, నిరుడి శివ, రవీందర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

# రిపోర్టులతో సరిపెడితే సరిపోదు..




## హెటెరో యూనిట్-1ను వెంటనే మూసివేయాలి.

## దోమడుగులో కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ (కేవీపీసీ) భారీ ర్యాలీ -

## ఎన్నికల బహిష్కరణకు పిలుపు.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 11:** కేవలం నివేదికలు ఇవ్వడం తోనే పీసీబీ బాధ్యత తీరిపోదు. 2013లో కూడా ఇలాంటి ఉత్తర్వులే ఇచ్చారు, కానీ కంపెనీ కాలుష్యం ఆపలేదు. ఇప్పుడు మాకు మాటలు వద్దు హెటెరో యూనిట్-1 మూసివేత కావాలి" అని దోమడుగు గ్రామ ప్రజలు గర్జించారు. కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ (కేవీపీసీ) ఆధ్వర్యంలో ఆదివారం రోజు గ్రామ పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీలో నిన్నదించారు. 2013లో పీసీబీ ఏ రకమైన ఆదేశాలు ఇచ్చిందో, ఇప్పుడు 2026లో కూడా అవే ఆదేశాలు ఇవ్వడం పీసీబీ చేతకానితనానికి నిదర్శనం. కంపెనీ కాలుష్యాన్ని వెదజల్లడం ఆపలేదు సరే కదా, అధికారులు రిపోర్టుల పేరుతో కంపెనీకి కాలయాపన చేసే అవకాశం ఇస్తున్నారని, 2013 లో నల్లకుంట చెరువు కాలుష్య నీటిని, మట్టిని ఎత్తి పోయాలని ఆర్డర్స్ ఇచ్చారు. ఇపుడు అదికూడా పి సి బి ఉత్తర్వుల్లో పేర్కొన లేదు. పాడైన చెరువు నీటిని, మట్టిని ఎవరు ఎత్తిపోయాలి, 12 ఏళ్లుగా విష వాయువులను వదిలి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తే ఎవరు బాగు చేయాలి, పశువుల మరణానికి మూల్యం ఎవరు చెల్లించాలి, వీటన్నింటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని టీపీజెఏసీ జిల్లా అధ్యక్షులు వై. అశోక్ కుమార్ మండిపడ్డారు.ఆరోగ్య విధ్వంసంపై మౌనమెందుకు?:దోమడుగులో గాలి, నీరు విషతుల్యం కావడం వల్ల మహిళలకు గర్భవిచ్ఛిన్నం కావడం, క్యాన్సర్ వ్యాధులు పెరగడం, చిన్న పిల్లలు రకరకాల అకాల వ్యాధుల బారిన పడటం అత్యంత దారుణమని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు చనిపోతున్నా, వ్యవసాయం పూర్తిగా నాశనమైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "జీవించే హక్కులో భాగంగా మంచి గాలి, స్వచ్ఛమైన నీరు పొందడం మా ప్రాథమిక హక్కు. మా హక్కును కాలరాస్తున్న హెటెరో డ్రగ్స్ యూనిట్-1ను వెంటనే మూసివేయాలి" అని ప్రజలు నినదించారు.కాలుష్య సమస్య పరిష్కారం కాకపోతే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పాల్గొనబోమని, ఎన్నికలను పూర్తిస్థాయిలో బహిష్కరిస్తామని కమిటీహెచ్చరించింది. సమస్య తీర్చని ప్రజాప్రతినిధులు మా ఊరికి ఓట్ల కోసం రావొద్దు అని గ్రామస్తులు స్పష్టం చేశారు. టి పి జె ఏ సి, క్లయిమేట్ ఫ్రంట్ బాధ్యులు పాల్గొని ప్రత్యక్షంగా పాల్గొని వారి సంపూర్ణమద్దతును ప్రకటించారు. హెటెరో యూనిట్-1ను వెంటనే మూసివేసి ప్రజల ఆరోగ్యానికి, భూములకు న్యాయం చేయని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కమిటీ ప్రకటించింది.ఈ కార్యక్రమంలో టీపీ జెఏసీ జిల్లా అధ్యక్షులు వై. అశోక్ కుమార్, రాష్ట్ర కో-కన్వీనర్ కన్నెగంటి రవి, జిల్లా కన్వీనర్ శ్రీధర్ మహేంద్ర, చంద్రారెడ్డి, క్లయిమేట్ ఫ్రంట్ బాధ్యులు రుచిత్,అభిలాష్ మరియు దోమడుగు కాలుష్య వ్యతిరేక కమిటీ కన్వీనర్లు బాల్ రెడ్డి, మంగయ్య, శారదమ్మతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు కార్యక్రమంను వినియోగించుకోవాలి..

## రంగారెడ్డి జిల్లా బిజెపి బీసీ మోర్చా అధ్యక్షులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్..

**మియాపూర్ ప్రభాత సూర్య :** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఎ నగర్ లో శనివారం ఆదివారం రెండు రోజులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం ను నిర్వహించారు. స్థానిక యువత ఆకుల మన్యం, ఉమ్మగోని ప్రకాశ్ గౌడ్, డి బాలు, ఉమ్మగోని ప్రవీణ్ గౌడ్, సిద్దు, కురుమూర్తి, రమేష్ లు ఈ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం కు హాజరైన రంగారెడ్డి జిల్లా బిజెపి బిసి మోర్చ అధ్యక్షులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి అని ఓటు హక్కు ద్వారానే స్ఫూర్తివంతమైన సేవా భావం ఉన్న ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలమని, అందుకోసం బాధ్యతగా ఓటు నమోదు చేసు కోవాలని ఈ ఓటరు నమోదు కార్యక్రమం ను మియాపూర్ డివిజన్ లోనీ అన్నీ కాలనీలలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశంను అందరూ వినియోగించు కోవాలని ఈ సందర్భంగా నాగేశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి ప్రెసిడెంట్ ఆకుల లక్ష్మణ్, గుండె గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్, జె రాము, పవన్, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్త వహించాలి..

## సర్పంచి పద్మావతి అశోక్ గౌడ్



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి11:** సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో పిల్లలు, యువకులు తగు జాగ్రత్తలు వహించాలని,నర్సాపూర్ మండలం రెడ్డి పల్లి గ్రామ సర్పంచి పద్మావతి అశోక్ గౌడ్ విజ్ఞప్తి చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలిపటాలు ఎగురవేసే క్రమంలో బిల్డింగులు,గోడల అంచుల వంటి ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండాలన్నారు.కరెంటు వైర్లలో చిక్కుకున్న పత్తంగులను తీయడానికి ప్రయత్నం చేయరాదని సూచించారు.పక్షులకు,పాదాచారులకు,ఇతరులకు హాని జరగకుండా సురక్షితమైన ప్రదేశాలలో మాత్రమే ఎగురవేయాలన్నారు.అదేవిధంగా చైనా మాంజా ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది కావున చైనా మాంజా ను ఎవరు వాడకూడదన్నారు.చైనా మాంజా కాకుండా ఇతరులకు హాని కలగకుండా ఉండే సురక్షితమైన మంజా ను మాత్రమే వాడాలన్నారు.విద్యుత్ తీగలు,ట్రాన్స్ఫార్మర్ల సమీపంలో కాకుండా ప్రశాంతమైన వాతావరణ పరిస్థితుల్లో ఉన్న మైదానాలలోనే గాలిపటాలు ఎగురవేయాలని గ్రామ ప్రజలకు,అదేవిధంగా మండల ప్రజలకు సర్పంచి పద్మావతి అశోక్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# బిజెపి ఆధ్వర్యంలో పలు ఆలయాలలో అభిషేకములు, హెూమకార్యక్రమాల నిర్వహణ..



**శేరిలింగంపల్లి (ప్రభాత సూర్య) :** సోమనాథ్ ఆలయం పై1025 లో గజిని మహమ్మద్ దాడి చేసి ఈరోజు నాటికి 1000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జాతీయ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అలాగే1951 లో పునర్నిర్మాణ జరిగి 75 పూర్తయిన సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్లోని ఐదు దేవాలయాలలో అభిషేకం, హెూమం లను నిర్వహించడం జరిగింది అదేవిధంగా అన్నప్రసాద వితరణ చేయడం కూడా జరిగింది. మియాపూర్ విలేజి శివాలయంలో జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్ మక్త మహబూబ్ పేట విలేజ్ గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీ నగర్, ఓంకార్ నగర్ లలో పారనంది నాగులు ఆధ్వర్యంలో న్యూ కాలనీ మియాపూర్ శివాలయంలో పత్తి బసవ శివ ఆధ్వర్యంలో అలాగే నడిగడ్డ తండ మియాపూర్ రత్నకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మనోహర్, రవిగౌడ్, శ్రీను రవీందర్ నాయక్, సిద్ధూ, శ్రీధర్, రాము, రవీందర్, వెంకట్ మొదలగు వారు పాల్గొనడం జరిగింది

# అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రావుల. చంద్రశేఖర్ రెడ్డి



**పెబ్బేరు. జనవరి 11 ప్రభాత సూర్య:** మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వడ్డే ఈశ్వర్, పూజారి గోపి స్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల ఎన్నికలలో గెలుపొందిన రంగాపూర్ గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన నారమ్మ గారి హేమలత కృష్ణారెడ్డి, వార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ నేను సర్పంచ్ పదవి నుంచి రాజకీయాల్లోకి రావడం జరిగిందని రాజ్యసభ సభ్యులుగా వనపర్తి మాజీ ఎమ్మెల్యేగా అనేక పదవులు చేపట్టి అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించింది. మీ మీద ఉన్న నమ్మకంతోనే ప్రజలు మిమ్ములను సర్పంచులుగా వార్డు సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కలిసికట్టుగా ఐక్యమత్యంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సాయినాథ్, కృష్ణారెడ్డి వేణుమాధవ్ రెడ్డి, వీరస్వామి, నందిమల్ల అశోక్, గౌస్, గోల్డ్ బాలస్వామి, కిషోర్, వేణు, మధు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**పెబ్బేరు జనవరి 11 ప్రభాత సూర్య :** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి ఉత్సవాల సందర్భంగా ఆజాద్, హనుమాన్ యూత్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ పిపిఎల్ 16 క్రికెట్ టోర్నమెంట్ ను ఆదివారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం చౌడేశ్వరి జాతర సందర్భంగా యువకులు క్రికెట్ క్రీడాకారులు ఎంతో ఉత్సవంగా ఉల్లాసంగా క్రీడలలో పాల్గొంటారని అన్నారు.క్రీడల వల్ల స్నేహసంబంధాలు పెరు గుతాయని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలి చేందుకు కృషి చేయాలన్నారు.ఈ క్రీడలకు మొదటి బహుమతి 50 వేలు, రెండవ బహుమతి. 30వేలు,మూడవ బహుమతి 20 వేల రూపాయలు క్రీడలో గెలుపొందిన వారికి కప్పులు అందజేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి . మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ ,మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్దుల కరుణ శ్రీ, సాయినాథ్ మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ కర్రే స్వామి ,మార్కెట్ మాజీ చైర్మన్ శ్యామల ,సాయి రెడ్డి , శేఖర్ గౌడ్, వేణుమన్యం, చిన్న ఎల్లారెడ్డి, ఎల్లయ్య ,మజీద్ , విశ్వరూపం, సహదేవుడు మధు రవీందర్, యాదవ్ మూర్తి, సాయి నిఖిల్ గౌడ్ వసంత్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జనవరి 11 (ప్రభాత సూర్య):** కొమురవెల్లి మల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహా రెడ్డి ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి స్వామివారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని క్యూఆర్ టి -1 టీమ్ ప్రాణాలకు తెగించి కాపాడారు

### సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 11 :** ఏడుపాయల వనదుర్గామాత దేవాలయం సమీపంలోని ఘనపూర్ అనకట్ట వద్ద, కామారెడ్డి జిల్లాకు చెందిన బసవయ్య అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు.ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న క్యూఆర్టి-1 సిబ్బంది ఏఆర్ఎస్ఐలు శ్రీనివాస్, సాయిలు తదితర సిబ్బంది పరిస్థితిని అప్రమత్తంగా గమనించి వెంటనే స్పందించారు. ప్రమాదకరమైన నది ప్రవాహంలోకి వెళ్లి, తాడు సహాయంతో చాకచక్యంగా వ్యవహరించి ఆ వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు.ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానిక ప్రజలు క్యూఆర్టి సిబ్బంది చూపిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తిని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.జిల్లా ఎస్పీ అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించి, ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడినందుకు క్యూఆర్టి సిబ్బందిని అభినందించారు.



# డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థుల దిక్సూచి డి ఎస్ ఎఫ్

### రామోజీ ఫిల్మ్ సిటీలో డి ఎస్ ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన సినీ ఫైటర్స్ రామ్ లక్ష్మణ్ లు

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ, డిఎస్ ఫ్ రాష్ట్ర కమిటీ క్యాలెండర్ ను సినీ ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ లు రామోజీ ఫిల్మ్ సిటీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సినీ ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ లు మాట్లాడుతూ డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థుల దిక్సూచి డి ఎస్ ఎఫ్ అని, ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ సినీ ఫైటర్స్ రామ్ లక్ష్మణ్ లు అన్నారు. తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ, డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2026 క్యాలెండర్ ని సినీ ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ లు ఆదివారం రామోజీ ఫిల్మ్ సిటీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఎస్ ఫ్ స్థాపించిన నుండి ఇప్పటివరకు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిఎస్ఫ్ వారు నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించి, రాష్ట్ర కమిటీ నాయకులను సన్మానం చేశారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి సమస్యల పరిష్కరణ కోసం వారి సంక్షేమం కోసం పనిచేయాలని డి. ఎస్. ఎఫ్ నాయకులతో భేటీ అయి దిశ నిర్దేశం చేశారు. అదేవిదంగా విద్యార్థులు, యువత చెడు వ్యాసనాలకు డ్రగ్స్, మదక ద్రవ్యలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జె.ఎన్టీ.యూ.హెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముందు వరుసలో ఉండి కొట్లాడిన పాలిటెక్నిక్ విద్యార్థులు, తెలంగాణ వచ్చిన తర్వాత వారి సంక్షేమం



కోసం వారి సమస్యల పరిష్కరణ కోసం డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. అదే విధంగా విద్యార్థి సంఘం స్థాపించినది మొదలు ఇప్పటివరకు అనేక విజయాలు పోరాడి సాధించుకున్నవే దీనిలో ముఖ్యంగా


1. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఒకటి లేదా రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయిన వేలాదిమంది విద్యార్థులకు జీవితం నిస్తూ డిప్లొమా సర్టిఫికెట్ ఇచ్చేలా అవార్డు ఆఫ్ డిప్లొమా ను 2020లో పోరాడి సాధించింది.
2. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు పోరాటం చేసి స్పాట్ అడ్మిషన్.
3. పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం యూనివర్సిటీలలో బీటెక్ సీట్లు పెంపుకై పోరాడి సాధించింది.
4. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇనిస్ట్రాంట్ పరీక్ష విధానంను పోరాడి సాధించింది.
5. పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్మెంట్స్ ను పోరాటం చేసి సాధించింది.
6. పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించేందుకు కృషి చేసింది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఎస్ ఫ్ రాష్ట్ర అధ్యక్షులు వివేక్ పటేల్, ప్రధాన కార్యదర్శి గడ్డం సతీష్ గౌడ్, మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చింతల అఖిల సోను, ప్రధాన కార్యదర్శి మౌనిక యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లపు మారుతీ, ఉత్తర తెలంగాణ అధ్యక్షులు బత్తుల సాయి రాజు, ధర్మ తేజ, ఉస్మానియా యూనివర్సిటీ ఇంచార్జ్ మాసం శ్యామ్, జె. ఎన్టీ. యూ హెచ్ ఇంచార్జ్ మహేష్ యాదవ్, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ రేవంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి లో రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రూ.60.5 లక్షల వ్యయంతో రోడ్డు పనులకు అంచనాలు...త్వరలో పనులు ప్రారంభం

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత సూర్య) :** టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పర్యటనలో భాగంగా ఎన్ఆర్ ఎస్ఏ కాలనీ, డైమండ్ హిల్స్, సీబీసీఐడి కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల వాసులు తమ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితిని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ ప్రజల అభ్యర్థన మేరకు, రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా బండి రమేష్ వెంటనే చర్యలు తీసుకొని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా రోడ్ల పనుల కోసం వర్క్ ఎస్టిమేషన్లు వేయించడం జరిందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ చౌదరి అన్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి సీబీసీఐడి కాలనీ రోడ్డు పనులకు రూ. 25 లక్షలు,ఎన్ ఆర్ ఎస్ ఏ కాలనీ, డైమండ్ హిల్స్ రోడ్డు పనులకు రూ. 35.5 లక్షలు, ఇంజనీరింగ్ అధికారులు త్వరలో టెండర్లు పిలిచి, రోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఇదివరకే గోపాల్ నగర్లో రూ. 80 లక్షల వ్యయంతో రోడ్డు పనులు



ప్రారంభం కాగా, డైమండ్ హిల్స్ ప్రాంతంలో ఐమాక్స్ లైట్లు, వీధి దీపాల ఏర్పాటు విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ అభివృద్ధి పనులన్నీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకుఇది నిదర్శనం అని అన్నారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి ప్రజల తరఫున బండి రమేష్ కు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివ చౌదరి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## దేవులపల్లి సర్పంచి మల్లేశం కు ఘన సన్మానం..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి11:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దేవులపల్లి గ్రామ సర్పంచి మల్లేశం ను ఆదివారం కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు పరమేశుల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మల్లేశం మాట్లాడుతూ హత్నూర మండల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తనను సన్మానించడం ఎంతో సంతోషం అన్నారు.తనను ఇంత ఘనంగా సన్మానించినందుకు కళ్ళబృంద్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో కళాకారుల బృందానికి ఏదైనా అవసరం వచ్చినప్పుడు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణ, మన్నే మహేష్, నర్సింలు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించాలి

### టీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఖమ్మం ఇన్చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు

**ఖమ్మం( సూర్య ప్రతినిధి ):** తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఖమ్మం ఇన్చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరై మాట్లాడారు, అనంతరం కూరపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా గ్రామ గ్రామాన పట్టణంలో పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు ఎక్కడ వివాదాలకు తావు లేకుండా సజావుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి జరుపుకోవాలని భారీ అన్నదాన కార్యక్రమం కూడా జరుగుతుందని అన్నారు.పార్టీ కార్యాలయం నుండి ఖమ్మం నగరం మొత్తం బైకు ర్యాలీ జరుగుతుందని పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.రేపు జరగబోయే జెడ్పిటిసి ఎంపీటీసీ మున్సిపాలిటీలు కార్పొరేషన్ ఎన్నికలలో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకే పోటీ ఉంటుందని మన జాతీయ అధ్యక్షుడు ఏపీ సీఎం నారా చంద్రబాబు ఆదేశాలతో పోటీ చేయడం జరిగితే ఉత్సాహవంతులైన యువతకు ప్రాధాన్యత ఉంటుందని అంతవరకు సమన్వయం పాటించాలని అన్నారు.అనంతరం టిడిపి నాయకుడు షేక్ సైదా మృతి చెందిన విషయం తెలుసుకొని నిమిషం పాటు మౌనం పాటించి సమావేశం లోనీ నాయకుల సహకారం తో కలిపి తక్షణసాయంగా 15 వేల రూపాయలు సభలోనే మృతుడి భార్య



ఖజాభీ కి అందించారు.ఈ కార్యక్రమంలో హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ వడ్డేం విజయ్ గుత్తా సీతయ్య వనమా వాసు వాసిరెడ్డి భాస్కరరావు మంద వెంకట నారాయణ మందడపు సుధాకర్ అరెం వరలక్ష్మి రామయ్య మల్లెంపాటి అప్పారావు ప్యారిస్ వెంకన్న గుడెపిన్ని నాగేశ్వరరావు మందపల్లి కోటేశ్వరరావు మేకల సత్యవతి తాడిశెట్టి స్వాతి కామ అనిత మంగమ్మ లావణ్య ఝాన్సీ నున్నా నవీన్ కన్నేటి పృధ్వీ కూచిపూడి జై నల్లమల రంజిత్ బ్రహ్మం 60 డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు రఘునాధపాలెం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్‌పీజే నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం( సూర్య ప్రతినిధి ):** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సమాజంలో శాంతి న్యాయం సామరస్యాన్ని పెంపొందించడంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల్లో మానవ విలువలు సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిం జిల్లా కోశాధికారి ఎండి హకీమ్ సెక్రటరీ ఎండి రజబ్ అలీ మాజీ సిటీ లైబ్రరీ చైర్మన్ ఎండి అశ్రిఫ్ బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ కాంగ్రెస్ లీడర్ ఎండి సాద్ ఎంపీజే జిల్లా సభ్యులు ఎస్.కె హుస్సేన్ మియా సయ్యద్ ఇస్మాయిల్ ఎస్ కే జానీ ఎస్ డి రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఒడ్డె ఓబన్న 219 వ జయంతి వేడుకలు

**యువతలో దేశభక్తి, త్యాగం, సేవా భావాలు పెంపొందించడమే జయంతి వేడుకల లక్ష్యం.**

**అదనపు కలెక్టర్ పాండు**





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి11:** దేశభక్తి, త్యాగం, సేవాభావం వంటి విలువలను యువతలో పెంపొందించడమే మహనీయుల జయంతి కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు అన్నారు. దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధుడు ఒడ్డె ఓబన్న 219 వ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు ముఖ్య అతిథి గా హాజరై ఒడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి ,ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న చేసిన పోరాటం భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో మరువలేనిదని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, త్యాగాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని రగిలించిన మహనీయుడిగా వడ్డే ఉబన్నను గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం నుంచి అందరూ స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందన్నారు. బలహీనవర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి గురించి యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆయన జీవితం, చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, బీసీ సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభు గౌడు, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పాటిల్, బి సి యూత్ అధ్యక్షుడు గోరుగంటి రమేష్ కుమార్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు కుమ్మరి సాయిలు, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి, కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వసతి గృహ సంక్షేమ అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. సజ్జనార్ ట్వీట్

హైదరాబాద్: చైనా మాంజా జనం ప్రాణాలు తీస్తున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పతంగుల పండగ నేపథ్యంలో 'గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదు' అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు. చైనీస్ మాంజా దారం తెగదు.. కానీ మనుషుల మెడలు, పక్షుల రెక్కలు తెగ్గోస్తుంది. మీ క్షణికానందం.. మరొకరి ఇంట తీరని విషాదం కాకూడదు. నిషేధిత చైనా మాంజా అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. పండగని పండగలా జరుపుకోండి. ప్రాణాలు తీసి కాదు' అంటూ సజ్జనార్ హెచ్చరించారు. కాగా, చైనా మాంజా విక్రయంపై నగర పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

# సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు

**కేసీఆర్ హయాంలోనే మహిళల అభ్యున్నతి, సంక్షేమం ... విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన నల్లమోతు సిద్దార్థ**





**మిర్యాలగూడ/ ప్రభాతసూర్య:** సంస్కృతీ సాంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎన్బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ తెలిపారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ హయాంలోనే మహిళల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమైందన్నారు. మిర్యాలగూడ పట్టణంలో 22వ వార్డు- హనుమాన్ పేటలో పద్మశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమోతు సిద్దార్థ మాట్లాడారు. మహిళల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు ఉపకరిస్తాయని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు, యువతులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జున చారి, ఇలియాస్ ఖాన్, పెండ్యాల పద్మ, పిన్నిబోయిన శ్రీనివాస్ యాదవ్, వింజం శ్రీధర్, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్ రాజు, తుమ్మల ఫణి కుమార్, కూరపాటి సాంబశివరావు, రేబెల్లి లోహిత్, అంజి,మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి శ్యామ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి - 2025 రద్దు చేయాలి



**ఫిబ్రవరి 12 దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి**

**పరిశ్రమ యజమానుల కోసమే శ్రమశక్తి నీతి - 2025**

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 11:** కార్మికులకు వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి 2025 రద్దు చేయాలని ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈరోజు సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్లో జరిగిన సిఐటియు జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు హాజరైనారు. ఈ సందర్భంగా సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ ముద్రించిన "శ్రమశక్తి నీతి 2025 కార్మికుల కోసమా..? యజమానుల కోసమా..?" అనే బుక్ లెట్ ను చుక్క రాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేందుకే శ్రమశక్తి నీతి 2025 తీసుకొచ్చిందని అన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమ యజమానుల ప్రయోజనాల కోసమని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని దాంట్లో భాగంగానే శ్రమశక్తి నీతి తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాల రాస్తుందని అన్నారు. 8 గంటల పని, సమ్మెకు హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు కార్మికులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమ యజమానుల ప్రయోజనాలు, లాభాలు పెంచే విధంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకే తెచ్చారని అన్నారు. వీటిని కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలని అన్నారు. ఫిబ్రవరి12 దేశవ్యాప్త సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా పిలుపునిచ్చాయని అన్నారు. ఈ దేశవ్యాప్త సమ్మెను కార్మికుల ఐక్యంగా జయప్రదం చేయాలనిపిలుపునిచ్చారు.. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సాయిలు జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ జిల్లా కోశాధికారి కె.రాజయ్య, ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, వి ప్రవీణ్, బి నాగేశ్వరరావు, బాగారెడ్డి, సహాయ కార్యదర్శులు ఎస్ మై పాల్, యాదగిరి, విద్యాసాగర్, సురేష్, యశోద, మంజుల సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యూనియన్ల ఆఫీస్ బేరర్స్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివి

**తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, ప్రముఖ న్యాయవాది మేకల సుగుణారావు**

**ఘనంగా ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభ, క్యాలెండర్ ఆవిష్కరణ**






**ఖమ్మం( సూర్య ప్రతినిధి ):** గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివని 'తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ ప్రముఖ న్యాయవాది మేకల సుగుణారావు అన్నారు. ఖమ్మం నగరం మమత మెడికల్ కాలేజ్ రోడ్ సివిఆర్ ఫంక్షన్ బాంకెట్ హాల్లో ఆదివారం తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభ, సంఘం క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ అత్యవసర పరిస్థితుల్లో రోగులను పట్టణాల్లోని ఆసుపత్రులకు తరలించి వారి ప్రాణాలను కాపాడడంలో వారి సేవలు మరువలేనివన్నారు. వారి సేవలను గుర్తించి గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు రక్షణ కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం ఏర్పడకు ముందు రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో పెట్టిన గ్రామీణ వైద్యుల నిబంధనలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో గ్రామీణ వైద్యులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ గుర్తింపు నిచ్చిన మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం కూడా గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించి తగిన గుర్తింపు నివ్వాలని కోరారు. గ్రామీణ వైద్యుల పై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం సంఘంలో ఉన్న ప్రతి సభ్యునికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా (టర్మ్ ఇన్సూరెన్స్) బాండ్లను అందజేయడం జరిగింది. అనారోగ్యానికి గురైన గ్రామీణ వైద్యులు ఘట్టం వంశీ గంట మణిరాజు లకు మహాసభలో ఆర్థిక సహాయాన్ని అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ వైద్యులపై దాడులు చేసిన అక్రమ కేసులు బనాయించిన వారికి అండగా ఉండి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తానని సభాముఖంగా ప్రముఖ న్యాయవాది మేకల సుగుణరావు హామీ ఇచ్చారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు నరసింహారావు రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వీరభద్రం రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నవరపు నగేష్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరావు జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు సుధాకర్ జిల్లా అధికార ప్రతినిధి షేక్ సిద్దు జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణారెడ్డి జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి సంపత్ జిల్లా న్యాయ సలహాదారి కాకటి కరుణాకర్ జిల్లా సహాయ కార్యదర్శి బోయినపల్లి రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ సైదా జిల్లా కోశాధికారి కమర్తపు వీరనాగేశ్వరావు జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ అల్లావుద్దీన్ ఖమ్మం పట్టణ ప్రముఖులు కొరిపల్లి శ్రీనివాస్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అలా అంటే కుదరదు కదా!

"నా సినీ ప్రయాణంలో ప్రేమకథలు చాలానే ఉన్నాయి. కానీ ఓ నటిగా నాకు 'తెలుసు కదా' ఇచ్చిన అనుభవం వేరు" అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ఆమె నటించిన చిత్రమే 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. నీరజ కోన దర్శకులుగా పరిచయం అవుతున్నారు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 17న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా రాశీఖన్నా శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "నేను ఇప్పటివరకూ తెరపై చూడని ఓ సరికొత్త కథాంశంతో రూపొందిన సినిమానే... 'తెలుసు కదా'. ముక్కోణపు ప్రేమకథే. అయినా ఇందులో ఒక విభిన్నమైన అంశం ఉంది. అదేమిటో తెరపైనే చూసి ఆస్వాదించాలి. నీరజ ఈ కథ చెప్పినప్పుడే నేను చాలా ఆశ్చర్యపోయా. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. సినిమాకి ఏది కావాలో అది పక్కాగా సమకూర్చే నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. చిత్ర పరిశ్రమలో ఏదైనా సరే, దానంతట అదే జరగాల్సిందే. మనం ప్రణాళిక వేసుకున్నంత మాత్రాన అలాగే జరుగుతుందని లేదు. నా దగ్గరికి వచ్చిన కథల్లో ఏది బాగుందనిపిస్తే, వాటిని ఎంపిక చేసుకుని ప్రయాణం చేస్తుంటా. నాకు పురాణాల నేపథ్యంలో కథలంటే ఇష్టం, హారర్ నేపథ్యమున్న కథల్లో నటించడం అన్నా, చూడటం అన్నా ఎంతో ఇష్టం. అలాగని అలాంటి కథల్లోనే నేను నటిస్తానని కూర్చుంటే కుదరదు కదా. ఎప్పుడు ఏ పరిశ్రమలో సినిమాలు చేస్తానన్నది కూడా నా చేతుల్లో ఉండదు. తెలుగులో పవన్‌కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' కోసం దర్శకుడు హరీష్‌శంకర్ ఫోన్ చేయగానే మరో మాట లేకుండా సినిమాకి అంగీకారం చెప్పా. ఆ తర్వాతే కథ విన్నా. పవన్‌కల్యాణ్‌తో కలిసి నటించడం గొప్ప అనుభవం.



## ఒకరిద్దరు కాదు, ఏకంగా 150 మంది బాడీగార్డ్స్

కొందరు బిగ్‌బాస్ సెలబ్రిటీలు బయటకు రాగానే చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఏదైనా ఈవెంట్‌కు వెళ్లినా, ఫంక్షన్‌కు వెళ్లినా చుట్టూ బాడీగార్డులను వెంటేసుకుని వెళుతుంటారు. గతంలో బిగ్‌బాస్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్.. సోనియా-యష్ పెళ్లికి కూడా బాడీగార్డులను వెంటేసుకునే పోయాడు. నిన్నగాక మొన్న బిగ్‌బాస్ 9 విన్నర్ పవన్ కల్యాణ్ పడాల పదిమంది బాడీగార్డులతో ఓ ఈవెంట్‌కు హాజరయ్యాడు. అయితే ఓ హిందీ కంటెస్టెంట్ మాత్రం ఏకంగా 150 మంది బాడీగార్డులను పెట్టుకుందంటూ ఓ వార్త వైరలవుతోంది. తను మరెవరో కాదు, తాన్య మిట్టల్. గొప్పలు చెప్పుకోవడంలో ఎప్పుడూ ముందుంటుందీ లేడీ కంటెస్టెంట్. పూటకో చీర కడతానని బిగ్‌బాస్ హౌస్‌కు దాదాపు 800 చీరలు తీసుకెళ్లింది. అలాగే 50 కిలోల నగలు కూడా పట్టుకెళ్లింది. లగ్జరీకి పెద్ద పీట వేసే ఈ బ్యూటీ తనకు 150మంది బాడీగార్డులున్నారన్న రూమర్‌పై తాజాగా స్పందించింది. తాన్య మిట్టల్ మాట్లాడుతూ.. నేను అలా ఎప్పుడూ చెప్పలేదు. ఇది కావాలని పుట్టించారు. నా కింద 150 మంది సిబ్బంది పనిచేస్తారని మాత్రమే చెప్పాను. దానికి బిగ్‌బాస్ హౌస్‌లోని ఓ కంటెస్టెంట్ జైషా ఖాద్రి.. వాళ్లందర్నీ నా బాడీగార్డ్స్ అని సరదాగా అన్నాడు.

## హీరో ఎవరనేది పట్టించుకోను: మీనాక్షి చౌదరి



'నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది?, దర్శకుడు ఆ కథను, అందులోని పాత్రలను ఎలా చూపించబోతున్నారు అనేది ఆలోచిస్తాను. హీరో ఎవరనేది ముఖ్యం కాదు. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. ఈ పాత్ర నా కెరీర్ కి ఎలా ఉపయోగపడుతుంది అనేది మాత్రమే చూస్తాను' అన్నారు యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి, నవీన్ పొలిశెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీనాక్షి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం చాలా చాలా సంతోషంగా ఉంది. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. ఈ సినిమాలో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన తండ్రి గారాల పట్టి లాంటి పాత్ర. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. క్యూట్ గా బిహేవ్ చేస్తుంది. నన్ను పూర్తి కామెడీ పాత్రలో చూడబోతున్నారు. ఇది చాలా భిన్నమైన పాత్ర. నిజ జీవితంలో కాలేజ్ సమయంలో ఒకరిద్దరిని ఇలాంటి వారిని చూసి ఉన్నాను. డైరెక్టర్ ఇచ్చిన ఇన్ పుట్స్ ని బట్టి, నాకున్న అవగాహనను బట్టి ఈ పాత్రలో ఒదిగిపోయే ప్రయత్నం చేశాను. నా నిజ జీవిత పాత్రకు పూర్తి భిన్నంగా ఈ పాత్రను చేయాల్సి వచ్చింది. నేను ప్రాక్టికల్ గా ఉంటాను. చారులత పాత్ర మాత్రం ఎమోషనల్, సెన్సిటివ్ గా ఉంటుంది. నవీన్‌తో వర్క్ చేయడం అనేది.. సినిమా టీచింగ్ స్కూల్ లా ఉంది. సంక్రాంతికి వస్తున్నాంలో కామెడీ ఒకలా ఉంటే, నవీన్ కామెడీ మరోలా ఉంటుంది. పైగా సంక్రాంతికి వస్తున్నాం సినిమా కామెడీగా ఉన్నా.. నా పాత్ర కాస్త సీరియస్ గా ఉంటుంది. కానీ, ఇందులో పూర్తిగా కామెడీగా ఉంటుంది. ఇందులో టైమింగ్ అనేది చాలా ముఖ్యం. పంచ్ డైలాగ్స్ ని కరెక్ట్ టైమింగ్ లో చెప్పడం అనేది ఛాలెంజింగ్ గా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో ఇదే ఎక్కువ ఛాలెంజింగ్ అని చెప్పవచ్చు. కామెడీ అనేది చాలా కష్టం. పైగా ఇందులో కామెడీ కామెడీ కొత్తగా ఉంటుంది. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా వల్ల నటిగా నేను మరింత ఓపెన్ అయ్యాను. లక్కీ భాస్కర్ లోని సుమతి పాత్రకు ఈ చారులత పాత్ర పూర్తి భిన్నమైనది.



## చచ్చిపోవాలన్న ఆలోచనలు.. దానివల్లే కోలుకున్నా!

చెప్పుకోలేని బాధ, విపరీతమైన ఆలోచనలతో ఇబ్బందిపడుతున్నప్పుడు మానసిక చికిత్స తీసుకోవడం చాలా అవసరం. అలా తాను డిప్రెషన్‌లో ఉన్నప్పుడు థెరపీ తీసుకుని చాలా మంచి పని చేశానంటోంది మలయాళ నటి పార్వతి తిరువోతు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. థెరపీ తీసుకోవడం అనేది నా జీవితంలో నేను తీసుకున్న మంచి నిర్ణయం. కాకపోతే మనకు కరెక్ట్ థెరపిస్ట్ దొరకాలి. అందుకు నాకు చాలా సమయం పట్టింది. మొదట్లో నేను అమెరికన్ థెరపిస్ట్‌ను కలిశాను. అర్ధరాత్రి ఒంటిగంట, రెండు గంటల సమయంలో నాతో మాట్లాడేవారు. తర్వాత ఇక్కడే ఉన్న థెరపిస్ట్‌లను సంప్రదించాను. వారు నా సమస్యలేంటో గుచ్చిగుచ్చి అడిగి.. వాటిని వెలికితీసి మరింత బాధపెట్టేవారు. అప్పటికే నేను తీవ్రమైన ఒంటరితనంతో బాధపడుతున్నాను. చచ్చిపోవాలన్న ఆలోచనలు కూడా వచ్చాయి. కరెక్ట్ థెరపిస్ట్ దొరికాక నా బాధకు ఉపశమనం లభించింది. నన్ను ఎంతో బాధపెట్టిన 2021 సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి నెలల్ని నా జీవితంలో నుంచే తీసేశాను. ప్రస్తుతం నేను కుటుంబం, ఫ్రెండ్స్, సినిమాలతో చాలా బిజీగా ఉన్నాను. నన్ను నేను ప్రేమిస్తున్నాను అని చెప్పుకొచ్చింది.




## 'నారీ నారీ నడుమ మురారి' అదిరిపోయేలా ట్రైలర్

శర్వానంద్ నటిస్తున్న 'నారీ నారీ నడుమ మురారి' మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. సంక్రాంతి కానుకగా జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో విడుదలకానుంది. ఈ మూవీని దర్శకులు రామ్ అబ్బరాజు తెరకెక్కించగా.. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఇందులో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. వివాహ భోజనంబు, సామజవరగమన వంటి సినిమాలకు దర్శకుడిగా పనిచేసిన రామ్ అబ్బరాజు తొలిసారి సంక్రాంతి రేసులో ఉన్నారు. ఈ మూవీలో శ్రీవిష్ణు అతిథి పాత్రలో కనిపించనున్నారు.

## తెలుగు హీరోయిన్.. దాసరి నారాయణరావు మనవరాలా?

ఈ సంక్రాంతికి రాబోతున్న సినిమాల్లో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ఒకటి. రవితేజ హీరోగా నటించాడు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా చేశారు. వీళ్లలో డింపుల్ గురించి తెలుగు ప్రేక్షకులకు తెలిసే ఉంటుంది. చాన్నాళ్లుగా సినిమాలైతే చేస్తోంది గానీ సరైన బ్రేక్ రావట్లేదు. ఈమె గురించి ఎవరికీ పెద్దగా తెలీదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దాసరి నారాయణరావుతో బంధుత్వం గురించి బయటపెట్టింది. దాసరి నారాయణరావు గారు నాకు తాత అవుతారు. మా తాతకు ఆయన కజిన్. అయితే ఈ విషయం చాలామందికి తెలీదు. ఇన్నాళ్లు ఎందుకనో పెద్దగా చెప్పుకోలేదు. మా నానమ్మ పేరు ప్రభ. హీరోయిన్ గా ఎన్నో సినిమాలు చేశారు. ఎన్టీఆర్ తోనూ అప్పట్లో 'దానవీర శూరకర్ణ'లో నటించారు. అలానే మా అమ్మ, వాళ్ల అక్కచెల్లెళ్లు అందరూ నటులే. తెలుగుతో పాటు మలయాళంలోనూ మూవీస్ చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.